# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ సోమవారం 15 ఏప్రిల్ 2024



ఘనంగా డాక్టర్ అంబేడ్కర్ జయంతి 8లో..

కల్లుల కేసులో నిందితుడి అరెస్ట్ - ఏసీపీ కృష్ణ 7లో..




# తుక్కు మాటున రేషన్ అక్రమ దందా

- ప్రతి నెల వందల టన్నులు అక్రమ రవాణా
- రెండు జిల్లాలకు కేంద్రంగా రామగుండం
- పట్టించుకోని అధికారులు



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 14: రామగుండం రేషన్ అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. స్క్రాప్ దందా మాటున రేషన్ బియ్యం అక్రమ దందా నిరాటకంగా సాగుతోంది. రేషన్‌షాపులకు మరీ అడ్వాన్స్‌లు ఇచ్చి బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నారు. గోదావరిఖని, ఎన్టీపీసీ కేంద్రాలుగా ముగ్గురు వ్యాపారులు ఈ దందాను కొనసాగిస్తున్నారు. రామగుండం కేంద్రంగా చేసుకుని రామగుండం అర్బన్‌తో పాటు అంతర్గాం, పాలకుర్తి, మంథనిలోని కొన్ని ప్రాంతాలు, జైపూర్ మండలంలోని పలు గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. రామగుండం నుంచి ఈరోడ్, సిర్పొంచ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ప్రతినెల 1వ తేది నుంచి 10వ తేదిలోపే వందల టన్నుల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది.

**● రేషన్ షాపులకు అడ్వాన్స్‌ల చెల్లింపు**

రామగుండం అర్బన్‌లోనే 74రేషన్‌షాపులు ఉండగా, పాలకుర్తిలో 18, అంతర్గాంలో 12రేషన్ షాపులు ఉన్నాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, రోజువారీ కూలీలు అధికంగా ఉండడంతో ఆహార భద్రత కార్డులు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. రామగుండం అర్బన్‌లో 60వేల నివాసాలు ఉంటే, 46,706 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. స్క్రాప్ వ్యాపారులు ఈ దందాలోకి అడుగుపెట్టడంతో కొత్త పంథావైపు మళ్లింది. రేషన్ షాపులనే గుత్తాపట్టి అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. లబ్ధిదారులు బయోమెట్రిక్ ముద్రలు వేస్తే చాలు రేషన్ షాపుల నుంచే నేరుగా మాఫియా చేతుల్లోకి బియ్యం వెళ్లిపోతుంది. రేషన్ డీలర్లకు అలాట్ అయిన కోటాలో మొదటి రెండు మూడు రోజుల్లోనే 30శాతం నుంచి 40శాతం రేషన్ మాఫియా లిఫ్ట్ చేస్తుంది. మిగిలిన బియ్యాన్నే డీలర్లు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. డీలర్లు లబ్ధిదారుల జాబితాను తయారు చేసుకుని బయోమెట్రిక్ వేయించుకుంటున్నారు. ఈ బియ్యాన్ని అక్రమ రవాణా దారులకు అప్పగిస్తున్నారు. డీలర్లు కిలోకు రూ.12 నుంచి రూ.14వరకు వీరికి విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. మహారాష్ట్రలో రెట్టింపు రేట్లతో మాఫియా విక్రయాలు చేస్తుంది. రేషన్ డీలర్లతో పాటు తమ వద్ద స్క్రాప్, ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు ఎరవేసి ఉదయం 5గంటల నుంచి 6.30గంటలలోపు ఆటోల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు.

**● టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి..**

రామగుండం పోలీస్ కమిషనర్‌గా శ్రీనివాస్ ఫిబ్రవరిలో బాధ్యతలు తీసుకున్నాక రేషన్ బియ్యం అక్రమ దందాపై దృష్టి పెట్టారు. ఇప్పటికే 20చోట్ల దాడులు జరిగాయి. కమిషరేట్ పరిధిలోని వివిధ ఠాణాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం ఉంటున్నా ఆయా ప్రాంతాల పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడం లేదు. జిల్లాలో కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని ప్రాంతాల్లో రేషన్ దందా చేసే వ్యాపారులున్నారు. గతంలో పలువురు వ్యాపారులపై పీడీ యాక్టులు కూడా నమోదు అయ్యాయి. అయినా కూడా వ్యాపారులు తమ పద్ధతిని మార్చుకోవడం లేదు. పైగా ఇటీవల కాలంలో బహిరంగంగానే షాపుల్లో నుంచి బియ్యాన్ని రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**● రవాణా సమయంలో అంతా గప్‌చుప్**

రామగుండం పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా రేషన్ మాఫియా సాగిస్తున్న అక్రమ దందాకు ప్రభుత్వ శాఖలు దన్నుగా ఉంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ మాఫియా ఏరియా వారీగా గోడౌన్లు పెట్టుకుని ఈ దందా సాగిస్తోంది. ఈ విషయం బహిరంగమే అయినా ప్రభుత్వ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రతినెల రేషన్ కోటా విడుదలైన మూడు రోజుల్లోనే వందల టన్నుల బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి టౌన్/కల్చరల్, ఏప్రిల్ 14 : అఖిల భారత అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్, పాంప్లెట్స్, స్టిక్కర్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాలు ఈనెల 14నుంచి 20వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో ప్రతిరోజు జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మాక్ డ్రిల్ ఏర్పాటు చేసి, అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈనెల15న జిల్లాలోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ప్రజా సంచార ప్రదేశాలు, 16న అపార్ట్మెంట్స్‌లో, 17న ఆసుపత్రులు, 18న పెట్రోల్ బంకులు, గ్యాస్‌సిలిండర్ గోదాములు, 19న వాణిజ్య ప్రదేశాలు మల్టీప్లెక్స్ సినిమా థియేటర్స్, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాల్స్‌లో అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు, 20న ఫైర్‌స్టేషన్‌లో సెమినార్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు పెద్దపెల్లి అగ్నిమాపక కార్యాలయంలో 1944, ఏప్రిల్ 14న ముంబైలో ఒక భారీ నౌకకు అగ్నిప్రమాదం సంభవించి, అగ్ని ప్రమాదం నివారించే సమయంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది మరణించారని వారి ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ అగ్నిమాపక జెండా సగంవరకు ఎగరవేసి, 2 నిమిషాలపాటు మౌనం పాటిస్తూ వారికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ డి.శ్రీనివాస్, లీడింగ్ ఫైర్‌మ్యాన్ ఎం.డి. సిరాజుద్దీన్, డ్రైవర్ ఆపరేటర్ పి.చంద్రయ్య, అగ్నిమాపక సిబ్బంది కే. శ్రీనివాస్, పి.నరేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న జాతరకు తరలివచ్చిన భక్తజనం



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, ఏప్రిల్ 14 : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం శ్రీమల్లికార్జునస్వామి జాతరకు ఆదివారం తీవ్రమైన ఎండలను సైతం కాదని భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసింది. ఇందులో భాగంగా మంచిర్యాల కాగజ్‌నగర్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఒగ్గు పూజారులతోని పట్నాలు వేయించారు. అలాగే మల్లికార్జున స్వామికి బోనాలను సమర్పించారు. అలాగే బంగారు పోచమ్మ, మదన పోచమ్మ ఆలయాల్లో భక్తులు మొక్కులను సమర్పించారు. వేసవి ఎండలు ఉధృతం అయినప్పటికీ భక్తులు వాహనాల ద్వారా జాతరకు తరలివచ్చి మొక్కులను సమర్పించిన అనంతరం కూడా తిరిగి తమ గ్రామాలకు వెళ్లకుండా ఎండవేడికి జాతర ఇరువైపుల ఉన్నచెట్ల నీడలో ఎండ తగ్గేవరకు సేద తీరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటు

**- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 14: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం తరుపున ముందుకువెళ్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో వారి ప్రావీణ్యాన్ని పెంచడం కోసం ప్రత్యేకంగా నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి ఆలస్యం జరుగుతున్నదన్నారు. హైదరాబాద్ నుంచి ప్రతి నియోజకవర్గంలో కోచింగ్ సెంటర్లకు వీడియోలు, ఆడియోల ద్వారా కోచింగ్ ప్రక్రియను ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరున విద్యను అందించాలనే ఆలోచన మేరకు ఈ నాలెడ్జ్ సెంటర్లను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని వారికి అనుగుణంగా మార్చాలనే ఆలోచన చేస్తున్నాయన్నారు. గత పది సంవత్సరాలపాటు అంబేడ్కర్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవస్థను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తితో,అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. రాహుల్‌గాంధీ పిలుపు మేరకు ఈ రాష్ట్రంలో నవసమాజం, సమానత్వంతో పరిపాలనలో పూర్తిస్థాయిలో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, నేతలు శశిభూషణ్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్, పోలు శివ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 14 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ము జమ్మిల్ ఖాన్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం అదనపుకలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి బస్టాండ్ చౌరస్తా వద్దగల అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా, జిల్లా అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా అంబేద్కర్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు ఎందరో బలహీన వర్గాలకు దళిత వర్గాలకు నిమ్న వర్గ ప్రజలందరికీ కూడా మార్గదర్శి అని కొనియాడారు. అంబే ద్కర్ ఆశయ సిద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగలైశ్వర్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

# ఎన్టీపీసీ ఉద్యోగుల పాదయాత్ర



జయంతి సందర్భంగా ఎన్టీపీసీలో పాదయాత్ర చేస్తున్న ఉద్యోగులు

ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీటీఎస్‌లోని అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు, ఇతర ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పార్కు నుంచి టౌన్‌షిప్ గేటు వరకు పాదయాత్ర నిర్వహించారు.

జ్యోతినగర్, ఏప్రిల్ 14 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని రామగుండం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ పీటీఎస్‌లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి సభలో ఈడీ మాట్లాడుతూ అంతరానితనాన్ని రూపుమాపడానికి అంబేద్కర్ తన జీవితాంతం పాటు పడ్డాడని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహా నేత అంబేద్కర్ అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఏజీఎం(హెచ్‌ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నవనీత్‌రాజ్, మహేంద్ర కుమార్, కోశాధికారి బాదె అంజయ్య, ఎన్ బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, గుర్తింపు సంఘం మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల కృష్ణయ్య, ఆరెపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అధ్యక్షుడిగా కంజపురం రాజేందర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 14: రామగుండం కార్పొరేషన్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అధ్యక్షునిగా కంజపురం రాజేందర్‌ను ఎనుకున్నారు. ఆదివారం అడ్డగుంటపల్లిలోని కెమిస్ట్రి, డ్రగ్గిస్ట్ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో లక్కం బిక్షపతిపై రాజేందర్ 57ఓట్లతో విజయం సాధించాడు. రాజేందర్‌కు 140ఓట్లు రాగా బిక్షపతికి 83ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా పోలు సతీష్‌కు 152ఓట్లు రాగా, కృష్ణ ప్రసాద్‌కు 71ఓట్లు వచ్చాయి. కోశాధికారిగా పిట్టల శ్రీనివాస్ గెలిచారు.



అధ్యక్ష,కార్యదర్శులను అభినందిస్తున్న సభ్యులు

# రామగుండం నియోజకవర్గంలో రాక్షస పాలన..

**- ఎమ్మెల్యే ప్రోద్బలంతో బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు - మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

జ్యోతినగర్, ఏప్రిల్ 14 : రామగుండం నియోజకవర్గంలో ప్రజా పాలన జరుగడం లేదని, రాక్షస పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. ఆదివారం ఎన్టీపీసీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రజల పాలన కొనసాగిస్తామని చెప్పిన కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా ప్రజా వ్యతిరేక పాలన చేస్తోందన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రోద్బలంతో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేత, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ ఎన్.వి.రమణారెడ్డిలపై సంబంధం లేని విషయంలో తప్పుడు కేసు పెట్టించారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరనందుకే డిప్యూటీ మేయర్‌పై కేసు పెట్టారని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో చేరాలని బీఆర్ఎస్ శ్రేణులను బెదిరిస్తున్నారని, పార్టీలో చేరని వారిపై తప్పుడు కేసులు పెడతున్నారని ఆరోపించారు. ఈ నాలుగున్నర నెలల్లో బీఆర్ఎస్‌కు చెందిన పదుల సంఖ్యలో నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని, ప్రశ్నించిన నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కోరుకంటి చందర్ ఆరోపించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ నేతృత్వంలో రామగుండంలో పోలీసు రాజ్యం నడుస్తోందని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించారని, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఎన్టీపీసీ ప్రాంత చిరు వ్యాపారుల ఉపాధి లేకుండా చేశారని ఆవేదనం వ్యక్తం చేశారు. మేడిపెల్లి సెంటరు, ఆటోనగర్‌ఏరియాలోని చిరు వ్యాపారులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించకుండానే దుకాణాలను తొలగించారన్నారు. ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు ఎన్టీపీసీ వార సంత వద్ద నామ మాత్రంగా స్థలాన్ని చూపించారని, ఎన్టీపీసీ యాజమాన్యం వారి స్థలంలో చిరు వ్యాపారులను రానీయడం లేదని, గతంలో ఉన్న ప్రహరీని మూసివేశారన్నారు. ఎన్టీపీసీ వార సంత ప్రహరీని కూల్చి చిరు వ్యాపారులకు భరోసాగా ఉన్నట్లు ఎమ్మెల్యే డ్రామాలాడుతున్నాడని ఆరోపించారు. వెంటనే మేడిపల్లి సెంటరు ప్రాంత చిరు వ్యాపారులు ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాలని, ఈ విషయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, పెద్దపల్లి పార్లీమెంటులో రానున్న ఎన్నికలలో ఎగిరేది ముమ్మాటికి గులాబీ జెండానేనని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంలో రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కొప్పుల ఈశ్వర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఈ నాలుగు నెలల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. గత పదేళ్లలో సుభిక్షంగా ఉన్న రైతులు ప్రస్తుతం దిక్కు తోచని స్థితిలో పడ్డారన్నారు. సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యారెంటీలు, 420 హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని చందర్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బుర్ర శంకర్, అచ్చ వేణు, నారాయణదాసు మారుతి, సత్తార్‌ఖాన్, కుమ్మరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించండి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 14: బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ట్రస్మా, రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్‌లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆదివారం సీఎంని కలిసి ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా బడ్జెట్ పాఠశాలలను చూడడం బాధాకరమని పేర్కొన్నారు. బడ్జెట్ పాఠశాలలకు సేవా రంగానికి వర్తించే ప్రాపర్టీ టాక్స్ వర్తింప చేయాలని, విద్యుత్‌బిల్లులో సెకండ్ క్యాటగిరీ నుండి సెవంత్ క్యాటరిగీలోకి ప్రైవేట్ పాఠశాలలను మార్చాలని వినతిపత్రంలో కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు చట్టపరమైన రక్షణ కల్పించాలని, తక్కువ వేతనాలతో సేవలను అందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులను ఇవ్వాలని, అన్ని జిల్లాల్లో కామన్ ఎగ్జామ్ ఫీజ్ వసూలు చేయాలని కోరారు. కఠినమైన విద్యా చట్టాల కారణంగా సాధారణ, గ్రామీణ ప్రాంతాల పాఠశాలల నిర్వహణ భారంగా మారిందని, వాటిని సరళతరం చేయాలని కోరారు.కార్పొరేట్ పాఠశాలలకు, ప్రభుత్వ ఆమోదిత చిన్న పాఠశాలలకు ఒకేరకమైన చట్టాలు వర్తింపజేయడంపై సమీక్షించాలని కోరారు. సీఎంని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, సభ్యులు అరుకాల రామచంద్రారెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 14: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి ఇసుక తీసుకు వస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్ డ్రైవర్ జన అరవింద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టారీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వృద్ధుడి అదృశ్యం

జమ్మికుంట, ఏప్రిల్ 14: జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన గాజుల పరుశురాములు (70) అనే వృద్ధుడు అదృశ్యం అయినట్లు ఆదివారం పోలీస్‌లు తెలిపారు. గత నెల 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తన తండ్రి ఆచూకీ తెలియడం లేదని కుమారుడు మల్లయ్య పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

గతంలో కూడా ఇదే విధంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి మళ్లీ నాలుగైదు రోజులకు తిరిగి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కుమారుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

## అప్పుల బాధతో ఆత్మహత్య

కోనరావుపేట, ఏప్రిల్ 14: కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ముష్కం లక్ష్మీరాజం (60) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముష్కం లక్ష్మీరాజం అస్తమాతో బాధపడుతున్నాడు. రెండేళ్ల క్రితం అస్తమాకు సంబంధించిన ఆపరేషన్ చేయగా నాలుగు లక్షల వరకు ఖర్చయ్యింది. ఆరోగ్యం పూర్తిగా కుదుట పడలేదు. ఆసుపత్రి కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఆరోగ్యం సహకరించక మనోవేదన గురై ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి బావుసాయిపేట గ్రామ శివారులోని మర్రిచెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు వెంకటేశం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మీరాజం భార్య రామవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వృద్ధురాలి ఆత్మహత్య



భూక్య పంతులి

వీర్నపల్లి, ఏప్రిల్ 14: కుటుంబ కలహాలతో ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామం లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య పంతులి (65) భర్త సీతారాం అప్పుల బాధతో ప్రతిరోజు తాగుతూ గొడవకు దిగేవాడు. శనివారం రాత్రి తన భర్త తాగి గొడవ పడడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ముందు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకున్న పంతులిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త సీతా రాం, కుమారులు రాములు నాయక్, భీమా నాయక్ ఉన్నారు.

## కళాశాలలో చోరీ

మల్యాల, ఏప్రిల్ 14: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దొంగ తనం జరిగింది. కళాశాలలోని ప్రిన్సిపాల్ గది, ఎగ్జామినేషన్ గది తాళాలు పగులగొట్టి అందులోని మానిటర్, సీపీయూలోని హార్డ్‌డిస్క్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ నెల 11న కళాశాలకు తాళం వేయగా ఆదివారం అటెండర్ మునుగూరి రాకేష్ తాళాలు తీయడానికి రాగ దొంగ తనం జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.



## రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 14: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవ స్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర అర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, శ్రీ భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసి పోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

### నెమలి వాహనంపై స్వామివార్ల విహారం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభస్వామివారలు నెమలి వాహనంపై విహరించారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను నెమలి వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణ వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు.

## రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం

మంథని, ఏప్రిల్ 14: పట్టణ శివారులోని ఆర్టీసీ బస్సు డిపో చౌరస్తా సమీపంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నారు. రేషన్ షాపుల ద్వారా సేకరిం చిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా డిపో సమీపంలో మంథనికి చెందిన పలువురు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంచుల్లో టీఎస్ 02 యూబీ 2032 అనే అశోక లేలాండ్ ఆటో ట్రాలీలో దాదాపు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. రేషన్ డీలర్ల నుంచి సేకరించిన ఈ బియ్యాన్ని పార్వతి బ్యారేజీ మీదుగా జైపూర్, చెన్నూరు మండలాల నుంచి సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలోని సిర్వోంచ ప్రాంతానికి తరలించి అధిక ధరలకు కొందరు స్మగ్లర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న రేషన్ బియ్యాన్ని కొంత మంది అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అంతర్గాం, ఏప్రిల్ 14: రామగుండం - పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య గురుకుల పాఠశాల సమీపంలో ఎగువ వైపు పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని రైలు కింద పడి రామగుండం పట్టంలోని భీమయ్య కాలనీకి చెందిన దండుగుల అంజి(29) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అంజి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిపారు.

### వృద్ధుడి ఆత్మహత్య

మానకొండూర్, ఏప్రిల్ 14: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆదివారం వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లింగయ్య (85) అనే వృద్ధుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### తాటి చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 13: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన బీమారి దేవయ్య(55) ఆదివారం తాటి ముంజలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. దేవయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని మైసమ్మ చెరువు ప్రాంతంలోని తాటి ముంజలు కోసేందుకు వెళ్లాడు. తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

## కాల్పుల కేసులో నిందితుడి అరెస్ట్

● తపంచా, ఆరు బుల్లెట్లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ



స్వాధీనపర్చుకున్న తపంచా, బుల్లెట్లు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 14: రెండు కుటుంబాల మధ్య భూతగాదాలు హత్యాయత్నానికి దారితీశాయి. తపంచాతో కాల్పులకు పాల్పడ్డ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో ఆదివారం వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం అనుబంధ గ్రామం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన ముస్కు మల్లారెడ్డి కుటుంబానికి, ముస్కు రామయ్య కుటుంబానికి కొన్నేళ్లుగా పెద్దంపేట్ గ్రామశివారులోగల 5 ఎకరాల వ్యవసాయ భూమి గురించి వీరి మధ్య వివాదం నడుస్తోంది. దీనిపై మల్లారెడ్డి కుటుంబం 2017లో కోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో మల్లారెడ్డిపై కక్ష పెంచుకున్న రామయ్య భూమి దక్కించుకోవడానికి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. 2018లో కాల్వశ్రీరాంపూర్ మండలం కొదురుపాక వద్ద గల ఇటుక బట్టీలో రామయ్య పనిచేస్తున్న క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో తుపాకులు దొరుకుతాయని తెలుసుకున్న రామయ్య మూడుసార్లు యూపీకి వెళ్లి ప్రయత్నించినా లభించలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న రామయ్య ఆగ్రాకు వెళ్లి ముప్పై వేలకు గుర్తుతెలియని వ్యక్తి వద్ద తపంచా, ఆరు తూటాలు కొనుగోలు చేశాడు. మార్చి 29న ఉదయం మల్లారెడ్డి తన మొక్కజొన్న చేనులో నీరు పెడుతుండగా రామయ్య తపంచాతో కాల్పులు జరుపగా గురి తప్పింది. మల్లారెడ్డి కేకలు వేయడంతో రామయ్య అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటనపై మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నింతుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రామయ్య భయపడి కరీంనగర్, మహారాష్ట్రలోని పలుచోట్ల బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాడు. ఈనెల 14 ఉదయం డబ్బుల కోసం ఊషన్నపల్లికి వచ్చిన రామయ్య తన మేనకోడలు సంగీత వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్ రామయ్య అదుపులోకి తీసుకున్నాడు. తపంచా కోసం విచారించగా తన ఇంటి పక్క భూమిలో పాతిపెట్టినట్టు తెలిపాడు. తపంచా, తూటాలను స్వాధీనం చేసుకొని నిందితుడు రామయ్యను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వివరించారు. ఈ కేసును చేధించిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్‌యాదవ్, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రాజేందర్, అశోక్‌తో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై ఓంకార్ యాదవ్, పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు, కాల్వశ్రీరాంపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల దాడులు

- కిలోన్నర బంగారం, ఏడు లక్షల నగదు స్వాధీనం



సొమ్మును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 14 : మెట్‌పల్లి పట్టణంలోని వడ్డీ వ్యాపారస్థుల ఇండ్లలో పోలీసులు ఆదివారం కూడా దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాన్ బ్రోకర్స్ పేరుతో బంగారాన్ని తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలతో వ్యాపారం చేస్తున్నారని సమాచారం మేరకు దాడులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని కటకం ప్రకాష్, కటకం రమేష్, కటకం శివ, కటకం కార్తీక్ ఇండ్లలో దాడులు నిర్వహించినట్లు ఆదివారం సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి తెలిపారు. శనివారం మధ్యాహ్నం మొదలైన దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగించినట్లు వారు వివరించారు. వారి వద్ద నుంచి తాకట్టు పెట్టుకున్న సుమారు రూ. 90లక్షల విలువ గల కిలోన్నర బంగారం, రూ. 7లక్షల నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులకు చట్టపరమైన నిబంధనలకు లోబడి వ్యాపారాలను నిర్వహించాలన్నారు. కటకం బ్రదర్స్ గత సంవత్సరంలో అధిక వడ్డీలకు పాల్పడుతున్నరని ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. మళ్లీ కటకం బ్రదర్స్ 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎలాంటి అనుమతులు లేకుండా బంగారం తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలకు పాల్పడ్డారని సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ గోరుమంతుల సుధాకర్, అధికారులు, పోలీసి సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏసీసీ, ఏప్రిల్ 14: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గాయాలపాలైన యువకుడు ఆదివారం మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు(34) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చి రాత్రి ముఖరాం చౌరస్తాలో స్నేహితున్ని కలుస్తానని చెప్పి బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లాడన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కాజీపేట నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొని గాయాలపాలయ్యాడన్నారు. మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదివారం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యాహ్నం మృతిచెందాడన్నారు. మృతునికి భార్య శ్రీలేఖ, కొడుకు, కూతురు ఉన్నారన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని ఎస్ఐ సుధాకర్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 14: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట శివారులోని చెరువుకుంటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దమ్మక్కపేట శివారులోని చెరువుకుంటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 4500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

ఓదెల, ఏప్రిల్ 14: మండలంలోని కొలనూర్‌కు చెందిన కొంగరి స్వప్న (29) చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పొత్కపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొలనూర్ గ్రామానికి చెందిన కొంగరి స్వప్న గత కొంతకాలంగా అందంగా లేనని, పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనోవేదకు గురైంది. ఈ నెల 12వ తేదీన తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

## లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 14: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన కోట సత్యనారాయణ అనే వ్యక్తి గత కొంత కాలంగా కేరళ రాష్ట్రం నుంచి లాటరీ టికెట్లు తీసుకుని వచ్చి అమ్ముతుండగా ఆదివారం వన్‌టౌన్ ఎస్ఐ సుగుణాకర్ అరెస్టు చేశారు. కేరళలో రూ.5ల కమీషన్‌తో గోదావరిఖని పట్టణంలో ప్రజలకు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని, తెలంగాణ లాటరీ టికెట్లపై నిషేధం ఉన్నందున సత్యనారాయణను అరెస్టు చేసినట్టు తెలిపారు.

## మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని జక్కుల శ్రీనివాస్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన రూ.2వేల విలువైన మద్యం సీసాలను శనివారం రాత్రి స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శ్రీనివాస్ తన ఇంటిలో మద్యం సీసాలను నిల్వ చేశాడనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. మద్యం సీసాలను స్వాధీన పర్చుకుని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ వైన్స్‌లో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్‌కు చెందిన పోలు శ్రీకాంత్ అక్రమంగా బెల్ట్ షాపు నడుపుటకు రూ.13,090 విలువ గల మద్యాన్ని మొలంగూర్ వైన్స్‌లో కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలి

●ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 14: మాదిగల ద్రోహి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాదిగలను అవమానించిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని, బీజేపీని గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎస్సీలకు ఎంపీ అభ్యర్థులుగా మూడు సీట్లు ఉంటే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ద్రోహం చేసిందన్నారు. దళితుల్లో 20 శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు, ఊరుకొక్క కుటుంబం ఉండే బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చారన్నారు. దళితుల్లో 75 శాతం ఉండే మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఐదు శాతం జనాభా ఉన్న రెడ్డి కులానికి రేవంత్‌రెడ్డి ఆరు సీట్లను కేటాయించుకున్నారన్నారు. మాదిగల మద్దతుతోనే ఈ స్థాయికి ఎదిగానంటూ అనేక వేదికలపైన చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఎన్నికల్లో అవకాశం ఇవ్వకుండా అవమానించారన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలను గతంలో భూస్థాపితం చేశామని, అదే గతి రేపు కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలంతా ఏకం కావాలన్నారు. ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీని ఓడించాలని, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, కరీంనగర్ అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, సిరిసిల్ల కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, రాష్ట్ర నాయకులు ఆవు నూరి ప్రభాకర్, గుండా థామస్, గుండ్రెడ్డి రాజు, బొల్లారం చంద్రమౌళి, నేరెళ్ల శ్రీనివాస్, బేస్ కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ అంబేద్కర్ జయంతి


పెద్దపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


ధర్మారంలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


ఖనిలో పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


అంబేద్కర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొప్పుల ఈశ్వర్


ముత్తారం, కమాన్‌పూర్‌లలో నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 14: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జెండాను ఆవిష్కరించిన ఘనంగా సంబురాలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూషవేని సురేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య భూతగడ్డ సంపత్, నాయకులు తాడూరి శ్రీమాన్, శ్రీకాంత్, అమ్రేష్, ఆర్కుటి సంతోష్, రమేష్, పెగడ రమేష్, ఈర్ల స్వరూప, మూడుసు సాంబి రెడ్డి, గన్నేని తిరుపతి రావు, బండారి సునీల్ గౌడ్, బొంకూరి నర్సయ్య ఆస్లాం, జంపయ్య, బాలసాని సతీష్, విజయేందర్, చెవుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**ధర్మారం** : అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ధర్మారంలో అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు దేవి జనార్ధన్, ఒరెం చిరంజీవి. తిరుపతి, కాంపెల్లి రాజేశం, దేవి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎలిగేడు** : మండల కేంద్రంతో పాటు నర్సాపూర్, ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట గ్రామాల్లో ఆదివారం అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తానపర్తి స్రవంతిమోహన్‌రావు, జడ్పీవైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య జల్లి రమేష్, బూర్ల వెంకటసత్యం తదితరులు పాల్గొన్నారు.

**జూలపల్లి** : మండల కేంద్రంతో పాటు వడుకాపూర్, కాచాపూర్, కుమ్మరి కుంట గ్రామాల్లో అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీవో కిరన్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, నాయకులు కన్నం రాంనారాయణ, కన్నం భరత్, కన్నం అజయ్, ఇంజపురి ప్రేమ్, కన్నం ఆనంద్, ఇరుగురాల మల్లేశ్, మాంకాలి రాజు తదితరులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్** : అంబేద్కర్ జయంతిని సుల్తానాబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణరావు పాల్గొని నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లుతోపాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, దళిత, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అల్లిపూర్, రేగడిమద్దికుంటలో గట్టు శ్రీనివాస్, గసిగంటి శ్రీనివాస్, తాడూరి రమేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**ఓదెల** : మండలంలోని గ్రామాలలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఓదెలతోపాటు పలు గ్రామాల్లో నాయకులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. కనగర్తిలో పార్టీలకు అతీతంగా ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, జడ్పీటీసీ గంట రాములు, తహసీల్దార్ యాకయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, అంబాల కొమురయ్య, శనిగరపు రమేష్, బైరి రవిగౌడ్, రెడ్డి శ్రీనివాస్, బోడకుంట నరేష్ పాల్గొన్నారు.

**కాల్వశ్రీరాంపూర్** : మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దళిత కాలనీ నుంచి ఎమ్మెల్యే విజయ రమణారావు అంబేద్కర్‌సంఘం నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటంతో ఊరేగింపుగా అంబేద్కర్ విగ్రహం వరకు తరలివచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ జాహేద్‌పాషా తన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్యయాదవ్, నాయకులు ఎండి మునీర్, పులి ఇంద్రకరణ్‌రెడ్డి, సబ్బని రాజమల్లు, పాల రాజేశం, ఉమా మహేశ్వర్, మాదాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి రూరల్** : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఏపీవో రమేష్‌బాబుతో పాటు సిబ్బంది ఉన్నారు. అప్పన్నపేటలో అంబేద్కర్ ఆశయ సాధన వారసులు సుద్దాల దేవ్‌కుమార్, వెంకటేష్, దుర్గయ్య, మనోజ్‌కుమార్, సాగర్, పెద్దబొంకూర్‌లో మిట్టపల్లి శ్రీనివాస్, నవీన్‌కుమార్, మల్లయ్య, సంపత్, లచ్చయ్య, రవి, నారాయణ పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**ముత్తారం** : మండలంలోని ఓడెడ్, పారుపల్లి, సీతంపేట, లక్కారం, గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, నాగినేని జగన్‌మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజి, గాదం శ్రీనివాస్, ఎడవేన సంపత్, బోడ రత్నకర్, బొడ బాపు తదితరులు పాల్గొన్నారు.

**కమాన్‌పూర్** : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. బస్టాండు ఆవరణలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనాల రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, గాండ్ల మోహన్, మాల్యాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**గోదావరిఖని** : అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన జయంతి సభలో అంబేద్కర్ చిత్రపటానికి, గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**రామగిరి** : సెంటినరీకాలనీ మార్కెట్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహనికి జడ్పీ చైర్మన్ పుట్టమధు పూల మాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. శంకేషి రవీందర్, మ్యాదరబోయిన శారద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్, వైస్‌ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీ రాజసంపత్, నాయకులు అల్లంతిరుపతి, గాజుల ప్రసాద్, శ్రీనివాస్, ఆసంతిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ** : కాంగ్రెస్ పార్టీ వెంకట్రావ్‌పల్లె శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ చాట్ల సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు శనిగరం తిరుపతి, మార్క రాజు, శ్రీనివాస్, అజయ్, సిద్ధు, శంషోద్దిన్ పాల్గొన్నారు. పోతనకాలనీలో సింగరేణి ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి అసోసియేషన్, దళిత సంఘాల నాయకులు, స్థానికులు ఘన నివాళులు అర్పించారు. సొప్పదండి దుర్గాప్రసాద్, అడ్కాపురం చంద్రమౌళి, సదానందం, శంకర్, హరీష్, సమ్మయ్య సంపత్ పాల్గొన్నారు.

**అంతర్గాం** : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి తహసీల్దార్ వీ రాంమోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామగుండం పట్టణంలోని మజీద్ టర్నింగ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి కార్పొరేటర్లు కౌశిక లతహరి, కన్నూరి సతీష్‌కుమార్, కుక్క గంగాప్రసాద్, జాగటి శ్రీకాంత్‌లు నివాళులర్పించారు. బుషిపాక సంతోష్, మాడిశెట్టి రవీందర్, దారంగుల కుమార్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**పాలకుర్తి** : అంబేద్కర్ జయంతిని ఆదివారం మండల వ్యాప్తంగా జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**మంథని** : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంథనిలోని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు పూలమాల వేసి ఆదివారం నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం వచ్చే వరకు అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ తగరం సుమలత, నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్‌లు ఉన్నారు.

**కోల్‌సిటీ** : బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామగుండం నగరపాలక సంస్థ, అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రామగుండంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి సింగరేణి సీఎండీతో మాట్లాడి స్థలం కేటాయించడంలో తాను ముఖ్య పాత్ర పోషించానని, అలాగే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను సన్మానించారు. మేయర్ బంగి అనీల్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కొలిపాక సుజాత, కల్వల శిరీష, బాల రాజ్‌కుమార్, న్యాతరి రాయమల్లు, కొంకటి లక్ష్మణ్, బొంకూరి మధు, కాంపెల్లి సతీష్, గొర్రె రమేష్, తిప్పారపు శ్రీనివాస్, కొప్పుల శంకర్, కీర్తి నాగరాజు పాల్గొన్నారు. గోదావరిఖని కోర్టు ప్రాంగణంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాంటెంకి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఘనంగా నిర్వహించారు. సైట్ ఇన్‌చార్జి, సీజీఎం ఎస్‌కే ఝా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు, ఆర్‌ఎఫ్‌సీఎల్ గుర్తింపు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ జంక్షన్‌లో, మంద కొమరమ్మ కాలనీలో, గోదావరిఖని చౌరస్తాలోని ఎంఆర్‌పీఎస్ ఆఫీసులో అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి, ఎంఆర్‌పీఎస్, వివిధ దళిత సంఘాల నాయకులు ఉప్పులేటి పర్వతాలు, మాతంగి శివరాజ్, పల్లె బాపు, కనుకుంట్ల రమేష్, రాసపల్లి రవికుమార్, రాసపల్లి రాంబాబు, నాగవెల్లి వేణు, రోడ్డ సంపత్, కాజీపేట రాజయ్య, మాటూరి నర్సింగం ఈర్ల శంకర్, లంక రత్నం, గద్దల దేవమ్మ, అడ్డూరి శాంత, కాజీపేట సౌజన్య, కాజీపేట సదానందం, మిట్టపల్లి అశోక్, బూడిద రాయమల్లు, రాజకుమార్ పాల్గొన్నారు.


మంథనిలో నివాళులర్పిస్తున్న పుట్ట మధు


ఖనిలో కేక్‌కట్ చేస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్


ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నివాళులర్పిస్తున్న సీజీఎం ఎస్‌కేఝా, అధికారులు


ఎలిగేడులో పారిశుధ్య కార్మికులకు సన్మానం..


సుల్తానాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


ఓదెలలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# గనులపై అంబేద్కర్‌కు ఘన నివాళి

గోదావరిఖని, ఏప్రిల్ 14: డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను సింగరేణిలోని అన్నీ గనులు, డిపార్ట్‌మెంట్లపై ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌జీ-1 ఏరియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం ఆఫీస్, కొత్త కూరగాయల మార్కెట్ వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌జీ-1 ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు ముఖ్యఅతిథిగా హాజరై జీఎం కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్త కూరగాయల మార్కెట్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు, ఎస్సీ, ఎస్టీ సంఘం సభ్యులు, ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో జన్మదిన కేక్ కట్ చేశారు. ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, ఏజియం(పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరి కే స్వామి, సీఎంఓఏఐ అధ్యక్షుడు కోలా మల్లేష్, ఎస్సీ లైజన్ ఆఫీసర్ దొంత వెంకటేశ్వర్లు, ఎస్టీ లైజన్ ఆఫీసర్ కారం పద్మ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఈర్ల రాజేష్, నాయకులు జనగామ నర్సయ్య,


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్జీ-1 ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు, ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ

శ్రీనివాస్‌నాయక్, గుగులోతు తిరుపతి, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, అధికారులు రామమూర్తి, నాగేశ్వర్ రావు, శివనారాయణ, జితేందర్ సింగ్, వర ప్రసాద్, చిలుక శ్రీనివాసు, రాజం, డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, బాల సుబ్రహ్మణ్యం, వీరారెడ్డి, సీనియర్ పీవో బంగారు సారంగపాణి, హనుమంతరావు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు లింగమూర్తి, రాంచందర్, గడ్డం శంకర్, రాజశేఖర్, కృష్ణ, రాములు పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ** : స్థానిక అంబేద్కర్ విగ్రహానికి ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచశీల పతాకాన్ని ఆవిష్కరించి, కేక్‌కట్ చేశారు. వ్యాసరచన పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం రవీందర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు మధుసూదన్, ఎస్సీ లైజనింగ్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, ఎస్టీలైజనింగ్ ఆఫీసర్ బుక్యదేశాయి, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బొక్కల శ్రీనివాస్, మల్లేష్, శంకర్‌నాయక్, అజ్మీరా కిషోర్, మొగిలితో పాటు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆర్జీ-2 ఏరియా పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై యాజమాన్యం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించింది. ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టులో ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ అంబేద్కర్ నివాళులు అర్పించారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు రేగుంట శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్, పీఈ శ్రీనివాస్, జక్కుల దామోదర్ రావు, నక్క రమేష్, పూర్ణాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**రామగిరి** : అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ల ఆధ్వర్యంలో రాణిరుద్రామాదేవి క్రిడప్రాంగణం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. తొలుత పతావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏరియా ఇంజనీర్ ఎలీషా, సీతారామం, ఏఐటీయుసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సి. రెడ్డి, ఐఎన్‌టీయుసీ ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అధికారులు శ్రావణ్‌కుమార్, వినాయక్, రాధాకృష్ణ, రాజేందర్, రాజేందర్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు దూప్‌సింగ్, బత్తులశంకర్, కిషన్, బాలంకూస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూలో చేరికలు


సీఐటీయూలో చేరిన లారీ డ్రైవర్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 14: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు ఆదివారం సీఐటీయూలో చేరారు. అనంతరం లారీ డ్రైవర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పోగుల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మీర్జా మంజూర్ అహ్మద్, కోశాధికారిగా జంగా తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంతోష్ మహేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా మాతంగి శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కొల్లూరి ఆంజనేయులు, సంతోష్. గౌరవ సలహాదారులుగా మునీర్ బేగ్, ఎస్‌డి మజహర్, ఎండీ నాసర్,అమ్ములు ,మల్లేష్ ఇమ్రాన్ బేగ్, తుంగపెల్లి సంపత్ ఆసంపల్లి తిరుపతి, గుండేటి సంపత్, వాజిద్ అలీ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని కుర్మపల్లి గ్రామానికి చెందిన వీడియోగ్రాఫర్ ఓదెలు శనివారం మల్యాలపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పరామర్శించారు. మృతుడికి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కౌశిక్ హరి, బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ కట్టెకోల వేణుగోపాల్, డీసీసీ జనరల్ సెక్రెటరీ సూర సమ్మయ్య పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 14 : యువత, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో యువతకు గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించగా బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి ముఖ్య అతిథిగా క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడలు ఆడటం ద్వారా మానసికంగా శారీరకంగా బలంగా తయారవుతారని, యువత దూర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితి కార్యదర్శి శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు, పీఈటి సురేందర్, మహేందర్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా మదన పోచమ్మ బోనాలు


పోచమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రామగిరి, ఏప్రిల్ 14: మండలంలోని లద్నాపూర్ గ్రామంలో ఆదివారం మదన పోచమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో పాటు పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటు పెద్దసంఖ్యలో మహిళలు మదన పోచమ్మకు విశేష పూజలు నిర్వహించారు. పవిత్ర స్నానాలు అచరించిన మహిళలు అమ్మవారికి బోనాలతో ఊరేగింపు చేపడుతు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## 'రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

పాలకుర్తి, ఏప్రిల్ 14: కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతులకు శాపంగా మారి కన్నీళ్ల తెప్పిస్తోందని భారాస జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం బసంత్‌నగర్‌లో పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కొరకు జరిగిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో చందర్ మాట్లాడుతూ నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదని అన్నారు. రానున్న పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న భారాస అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కొరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో అంతర్గాం జడ్పీటీసీ ఆముల నారాయణ, పాలకుర్తి మండల వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, నాయకులు ముల్కాల్ల కొమురయ్య, బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ కట్టెకోళ వేణుగోపాల్‌రావు, బండి శ్రీనివాస్, కనుకం కొమురెల్లి, ముత్యం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 'మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి'


అంబేద్కర్, జార్జిరెడ్డి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 14: మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, భారత జాతి గర్వించదగ్గ మేధావి అంబేద్కర్ అని ఐఎఫ్‌టీయూ నాయకులు ఐ కృష్ణ, ఈదునూరి నరేష్ అన్నారు. అంబేద్కర్ జయంతి, జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రాసి జాతి ప్రజలకు అంకితం చేసిన ఘనత అంబేద్కర్‌దన్నారు. విద్యార్థి ఉద్యమంలో ప్రగతిశీల ఆలోచనలతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తిన జార్జిరెడ్డి అని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదానికి పాల్పడుతుందని, పదేళ్లుగా కులాల పేరిట, మతాల పేరిట, దేశభక్తి పేరుతో యువతను తప్పుదారి పట్టిస్తుందన్నారు.

విద్యారంగాన్ని విధ్వంసం చేయడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చారని, వాటిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్, జార్జిరెడ్డిల స్ఫూర్తిని ప్రజలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, అశోక్, శంకర్, దుర్గయ్య, మొగిలి, అబెద్నెగో, రాజన్న, బుచ్చమ్మ, రాంకీ, లింగమూర్తి, ఎల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.